క్లుప్తంగా

నేటితో ముగియనున్న సాయి నవరాత్రులు

కాజులూరు: గ్రామాల్లో గత తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న సాయి నవరాత్ర మహోత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. ఈ నెల రెండో తేదీ నుంచి గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో భక్తులు నవరాత్ర ఉత్సవాలు నిర్వహించారు. సాయిబాబా ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించి ఆలయాల ఎదుట చలువ పందెళ్లు వేశారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం బాబా వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం విష్ణు సహస్ర సామూహిక పారాయణ, అష్టోత్తర విభూది పూజలు నిర్వహించారు. రాత్రి సమయాల్లో భక్తులు జ్యోతులను చేతపట్టుకుని సాయి నామకీర్తనలు ఆలపిస్తూ గ్రామోత్సవాలు చేశారు. మండలంలోని కాజులూరు, ఆర్యావటం, చేదువాడ, గొల్లపాలెం, శీల, దుగ్గుదుర్రు, కుయ్యేరు, ఉప్పుమిల్లి, పెనుమళ్ల, అయితపూడి, జగన్నాథగిరి తదితర గ్రామాల్లో సాయి బాబా నవరాత్ర ఉత్సవాలు జరిగాయి. ఆర్యావటంలో ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు నిత్యా అన్నదానం చేశారు. ముగింపు అనంతరం గురువారం ఆలయాల వద్ద అన్నసమారాధన చేసేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్



గొల్లపాలెంలో తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

కాజులూరు: గొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. స్కూల్ హెచ్ఎం పి.సుశీలామణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అండర్-14, అండర్-17 బాలికల విభాగంలో ఖోఖో, కబడ్డీ, షటిల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 150 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు వారం రోజుల్లో కాకినాడలో జరగనున్న డివిజన్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలలో పాల్గొంటారని మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్, గొల్లపాలెం పీడీ జి.సునీల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు ఇమాన్యుల్, అప్పారావు, మూర్తి, జయలక్ష్మీ, రాజ్యలక్ష్మి, శ్రీను, జగదీష్, స్థానిక పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనుల గుర్తింపు



తాతపూడి గ్రామ సభలో వివరాలు వెల్లడిస్తున్న ఉపాధి సిబ్బంది

కపిలేశ్వరపురం: క్షేత్రస్థాయిలో ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి పనులను పారదర్శకంగా గుర్తించాలని వెదురుమూడి, తాతపూడి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఉపాధి గ్రామ సభల్లో పాల్గొన్న వక్తలు అన్నారు. ఆయా గ్రామాల సచివాలయాలు వద్ద ప్రజా ప్రతినిధులు అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించగా ఉపాధి పనుల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమక్షంలో ఉపాధి పనులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జిత్తుక వెంకటలక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ జేఈ, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



పశువ్యాధి నియంత్రణ కార్యక్రమంలో సర్పంచ్ సతీష్‌రావు తదితరులు

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో పశుసంవర్ధక ఏడీ డాక్టర్ ఓ రామకృష్ణ పర్యవేక్షణలో పశుసంవర్ధక సహాయకురాలు టి.నాగమల్లీశ్వరి సిబ్బందితో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంట వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న 70 పశువులకు గాలిగుంట నిరోధక టీకాలు వేసినట్లు పశుసంవర్ధక సహాయకురాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సబ్బెల్ల ప్రసాద్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

కపిలేశ్వరపురం (మండపేట): వ్యాధుల వ్యాప్తికి కారణమైన దోమల నివారణకు మండపేట పట్టణంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆదేశాలపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం సత్తిరాజు ఆధ్వర్యంలో సిబ్బంది దోమల నివారణకు చర్యలు చేపట్టారు. నీరు నిల్వ ఉన్న గుంతలు, డ్రైయిన్లలో ఆయిల్ బంతులను వేశారు.

వరిపై మూషిక దాడి



కాజులూరులో ఎలుకల దాడికి గురైన పైరు



గొల్లపాలెంలో ఎలుక కొరికిన వరి దుబ్బు

- ఈనిక దశలో దుబ్బులను నాశనం చేస్తున్న ఎలుకలు
- పెట్టుబడి పెరగటంతో రైతుల ఆందోళన

కాజులూరు: ఏపుగా పెరుగుతున్న పంట త్వరలో చేతికందుతుందన్న రైతన్నల ఆశలను ఎలుకలు అడియాశలు చేస్తున్నాయి. వరి పంట పై ఎలుకల దాడి రోజురోజుకీ పెరిగిపోతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా మూషికాలు పొలాల్లో విజృంభిస్తున్నాయి. వరి దుబ్బులను కొరికిపాడేస్తున్నాయి. నియోజకవర్గంలోని గ్రామాల్లో వరి పొలాలు చిరుపొట్ట దశలో ఉన్నాయి. చీడపీడలను నివారిస్తూ ఎరువులు వేసి ఏపుగా పెంచిన వరిపంట ఎలుకల తీవ్రతకు నాశనమవుతుంటే రైతులు లబోదిబోమంటున్నారు. వాటి నివారణకు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం అంతంతమాత్రంగానే ఉంటుందని రైతులు చెబుతున్నారు. బుట్టలు పెట్టి



ఎలుకలు కొరికిపారేసిన వరి దుబ్బులను పొలం నుంచి బయటకు తీసుకువస్తున్న రైతు

పట్టినా, బొరియల్లో పొగపెట్టి ఊదరపెట్టినా, మందులు ఎన్ని వాడినా ఎలుకల ఉధృతి తగ్గటం లేదు. ఎలుకల నిర్మూలనకు అధిక ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎలుకలు దాడి జరిగిన పొలంలో ఎకరానికి 10 బస్తాల వరకు దిగుబడి తగ్గి పోతుందని రైతులు చెబుతున్నారు. రైతులు తమ పొలాల్లో మందులు పెట్టి ఎలుకలను నిర్మూలించినప్పటికీ పక్క పొలాల్లోంచి వచ్చి తమ సంతతిని వృద్ధి చేసుకుంటూ పంటలపై దాడిచేస్తున్నాయి. అయితే రైతులు ఎవరికి వారే తమ పొలాల్లో ఎలుకల నివారణ చర్యలు చేపట్టడం కాకుండా సామూహిక చర్యలు చేపడితే వాటిని సమూలంగా నిర్మూలించవచ్చునని వ్యవసాయశాఖ బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేసి సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఈ బ్రోమోడయోలిన్ మందుతో మూషిక సంహారం సాధ్యంకావటంలేదని రైతులు వాపోతున్నారు.
నియోజకవర్గంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఎలుకలు పంటపొలాలపై దాడి చేసి వరి మొక్కలను నాశనం చేస్తున్నాయి. ఎలుక కొరికిన మొక్కను వెంటనే పొలం నుంచి తొలగించకుంటే అవి మరింత విజృంభించి పంటను పాడుచేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. చిరుపొట్ట దశలో ఉన్న వరి మొక్క, గింజపాలుపోసుకునే దశలో ఉన్న వరి కంకు తియ్యగా ఉండడంతో పొలాల్లో ఎలుకల దాడి ఎక్కువగా ఉందని వరి మొక్కకు పొట్ట తగిలితే ఎలుక ఇక మందులను అంతగా తినదని నష్ట తీవ్రత అధికంగా ఉంటుందని రైతన్నలు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎలుకల నిర్మూలన చర్యలకు అవసరమైన మందులు పంపిణీ చేసి తమకు సహకరించాలని రైతులు కోరుతున్నారు.

పంట నాశనం



ఎలుకల దాడికి పంట నాశనమవుతోంది. ఎలుకలు వరి దుబ్బులను మొదలను కొరికి పాడేవేస్తుండడంతో మొక్క పూర్తిగా చనిపోతుంది. కొరికిపారేసిన మొక్కలను వెంటనే తొలగించకుంటే ఎలుకలు మరింత విజృంభించి పంటను పాడుచేస్తున్నాయి.

– డివివి సత్యనారాయణ, రైతు ఆర్యావటం

దిగుబడి తగ్గిపోతుంది



వరి పంటపై ఎలుకల దాడి వలన అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. మార్కెట్‌లో దొరికే ఖరీదైన మందులు వాడినా అవి తగ్గడం లేదు. ప్రభుత్వం స్పందించి ఎలుకల నివారణకు అవసరమైన మందులను పంపిణీ చేసి రైతులను ఆదుకోవాలి. ఎలుకల దాడి వలన ఎకరానికి సుమారు 10 బస్తాలు పైబడి దిగిబడి తగ్గిపోతుంది.

– ద్వారంపూడి సోమిరెడ్డి, రైతు మొగలిపాలెం

చేనేతను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం



అంగర చేనేత సంఘంలో మద్దతు పలుకుతున్న రాష్ట్ర కమిటీ నాయకులు

కపిలేశ్వరపురం: తమ సంఘానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను త్వరితగతిన చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అంగరలో శ్రీగణపతి చేనేత పారిశ్రామికుల సహకార సంఘం చేనేత కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 12వ రోజు కొనసాగాయి. పలు ప్రాంతాల్లోని చేనేత కార్మిక సంఘాలు నేతలు, వైఎస్సార్ సీపీ నాయకులు వారికి మద్దతుగా నిలిచి సంఘీభావం తెలిపారు. ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ చేనేత రంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. దీర్ఘకాలంగా చేనేత సహకార సంఘాల బకాయిలను చెల్లించాలని విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అంగర చేనేత కార్మికులు చైతన్యంతో ముందుకు వచ్చి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలను చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేత రంగం అభివృద్ధికి కనీసం ఒక్క రూపాయి కూడా నిధులను కేటాయించకపోవడం దారుణమని అన్నారు. చేనేత రంగాన్ని విస్మరించడం తగదని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా శివదుర్గారావు, సహాయ కార్యదర్శి వాసా గంగాధరరావు, గోరు రాజు, పశ్చిమగోదావరి జిల్లా చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద జోగేశ్వరరావు, అధ్యక్షుడు చల్లా వీరభద్రుడు, నాయకులు బళ్ళ చిన వీరభద్రరావు, వాసా రామలింగం, జంజం శివ భావనారాయణ సంఘీభావం తెలిపారు.



అంగర చేనేత సహకార సంఘం ఎదుట దీక్షకు సంఘీభావం తెలిపిన వైఎస్సార్ సీపీ నేతలు

చేనేత కార్మికులకు వైఎస్సార్ సీపీ నేతల మద్దతు

చేనేత సహకార సంఘానికి ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించాలంటూ అంగర చేనేత సహకార సంఘం ఎదుట చేనేత కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు వైఎస్సార్ సీపీ మండల నాయకులు శుక్రవారం మద్దతు పలికారు. పార్టీ మండల నాయకుడు మేడిశెట్టి దుర్గారావు, మండల పరిషత్ విప్ పలివెల మధు, ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి దుర్గారావు, నాయకులు కొప్పిశెట్టి రామ్‌కిశోర్, పాలింగి శ్రీనివాస్ రిలేదీక్షలో కూర్చుని మద్దతు తెలిపారు.

సంఘం నిర్మాణానికి సభ్యత్వం తప్పనిసరి

రామచంద్రపురం రూరల్: సంఘం తాలూకా స్థాయిలో బలమైన నిర్మాణానికి ఉద్యోగులు తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలని ఏపీఎన్జీవో అసోసియేషన్ అడక్ కమిటీ నూతన అధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వర్లు అన్నారు. రామచంద్రపురం మండలం అన్నయ్యపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏపీఎన్జీవో అసోసియేషన్ నాకు సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం అసోసియేషన్ రామచంద్రపురం తాలూకా యూనిట్ అధ్యక్షుడు శ్రీ చిక్కాల సూర్యారావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకటేశ్వర్లు పాల్గొని ఉద్యోగులకు సభ్యత్వాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ నియమించాలని పెండింగ్ డీఏలను విడుదల చేయాలని ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పనిభారం తగించాలని ప్రభుత్వనికి ఏపీఎన్జీవో సంఘం నివేదించామన్నారు. పక్షం రోజుల్లో ఉద్యోగులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పంచాయతీ కార్యదర్శి ఏఎస్ శ్రీనివాస్ విలేజ్ హెల్త్ సెక్రటరీ రాజేశ్వరి సచివాలయం సిబ్బంది ఆరోగ్య సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు ఏపీఎన్జీవో సభ్యత్వాలను అందిస్తున్న వెంకటేశ్వర్లు

ఘనంగా సేవక్ విజయదశమి ఉత్సవాలు

కె.గంగవరం: అముజూరు గ్రామంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విజయ దశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక గొల్లాలమ్మ గుడి ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో రామాఖండ్ ప్రయోజకులు పుల్లెల రామ్మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సంఘ్ ఏర్పడి 100 సంవత్సరాలు అయిన సందర్భంగా 2025 నుంచి 2026 వరకు దేశమంతా శతాబ్ది ఉత్సవాలు జరపాలని సంఘం నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగానే అక్టోబర్ 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పలు సంఘ మండలాల్లో విజయదశమి ఉత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షులు ఏవీ రమణమూర్తి మాట్లాడుతూ 1925 సంవత్సరం ఆశ్వీయుజ మాసం విజయ దశమికి నాగపూర్‌లో హెగ్డేవార్ స్వయం సేవక్ సంఘాన్ని ప్రారంభించారని నేటికీ అవి 75 వేల శాఖలతో లక్షలాది మంది దేశభక్తి కలిగి దేశం కోసం ధర్మం కోసం పని చేస్తున్నారని సూచించారు. ఈ కార్యక్రమంలో మరివాడ సూర్యనారాయణ, జి.ప్రభాకర్, కొలూరి వెంకట కృష్ణ, నున్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వయం సేవక్ సేవకులు

కుందూరులో 'పొలం పిలుస్తోంది'

కె.గంగవరం: గ్రామీణ ప్రాంత రైతులు తప్పకుండా వ్యవసాయాధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. కుందూరులో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ నాగమణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక దిగుబడి రావాలన్నా, వరి పంటకు తెగుళ్లు సోకకుండా ఉండాలన్నా వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా వరి పంటకు తెగుళ్ల సోకితే ఇష్టం వచ్చినట్లు ఎరువులు వాడకూడదన్నారు. సిబ్బంది సూచనల మేరకు ఎరువులు వాడాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఓ సద్గురుమూర్తి మాట్లాడుతూ ఆకు ముడత పురుగు జీవిత చరిత్ర, దాన్ని నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పంపన సుబ్బారావు, సొసైటీ చైర్మన్ జగతా రమణ, నాయుడు, కొరిపల్ల సురేష్, వీఏఏలు రేవతి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం

కపిలేశ్వరపురం (మండపేట): క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో శుక్రవారం రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ, స్పోర్ట్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, పరుగుపందెం, సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకుడు, లెఫ్టినెంట్ కమాండర్ డాక్టర్ కేఎస్ఆర్ ఎన్‌వీ కిరణ్, వెంకన్న, వ్యాయామ అధ్యాపకుడు చంద్రశేఖర్ రాజేష్, వీర్రాజు, చంటి, జి.ఇస్మాయిల్, యువజన మంత్రిత్వ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

అన్ని రంగాల్లో ముందుండాలి



కృత్తివెంటి డిగ్రీ కళాశాల వేదికపై అధ్యాపకులు

రామచంద్రపురం: ప్రతి విద్యార్థి చదువుతో పాటుగా అన్ని రంగాల్లో ముందుండాలని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం కళాశాలలో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ ఈ రోజు ఫ్రెషర్స్ డేని బీఏ విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు అన్ని రంగాల్లో కూడా ముందుండాలని, ఇదే ఉత్సాహాన్ని చదువులో కూడా చూపించి ఉత్తమ ప్రతిభను చాటాలన్నారు. సీనియర్ విద్యార్థులు కళాశాలలో చేరిన కొత్త విద్యార్థులు అందరికీ కూడా ఘనంగా స్వాగతం పలికారు. సీనియర్ విద్యార్థులు కళాశాల గురించి జూనియర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిలు చక్కటి నృత్య ప్రదర్శనలుతో అలరించారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాలికల హక్కులను పరిరక్షించాలి



కపిలేశ్వరపురంలో బెలూన్లు ఎగురవేస్తున్న విద్యార్థినులు

కపిలేశ్వరపురం: బాలికల హక్కులను ప్రతి ఒక్కరూ పరిరక్షించాల్సిన అవసరం ఉందని వల్లూరు, కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో పాల్గొన్న వక్తలు అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్, శ్రమ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. శ్రమ సంస్థ కో ఆర్డినేటర్ నాగేశ్వరి, మాట్లాడుతూ బాల్య వివాహాలు, యుక్త వయస్సులో వచ్చే మార్పులు, బాలల అక్రమ తరలింపు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు, బాలికల విద్య, బాలికలకు ఆత్మరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. వారంతా విద్యార్థులతో ఉత్సాహంగా బెలూన్స్ ఎగురవేసి స్వేచ్ఛా గీతాన్ని ఆలపించారు.

సీసీ రహదారి నిర్మాణ పనుల పరిశీలన

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని 1, 29వ వార్డుల్లో సీసీ రహదారుల నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.77 లక్షలతో రహదారి నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, ఏఈ డి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం



రాయవరం పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేస్తున్న రాష్ట్ర ఐజీ అశోక్‌కుమార్

రాయవరం: బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు ముమ్మరం చేశామని రాష్ట్ర ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. రాయవరం పోలీస్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. రాయవరంలో బుధవారం జరిగిన బాణసంచా ప్రమాదం నేపథ్యంలో అక్కడ పనిచేసిన కార్మికులను, ప్రత్యక్ష సాక్షులను ఆయన విచారించారు. విచారణ అనంతరం ఆయన మాట్లాడుతూ బాణసంచా తయారీ కేంద్రాల వద్ద అగ్నిమాపక భద్రతా పరికరాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. సాంకేతిక వినియోగంపై అవగాహన లేని కూలీలతోనే వాటిని వినియోగిస్తున్నారన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో అన్ స్కిల్డ్ లేబర్ వాటి వినియోగంపై అవగాహన లేకపోవడంతో ప్రమాద తీవ్రత పెరుగుతోందన్నారు. ప్రతి బాణసంచా తయారీ కేంద్రంలో శిక్షణ పొందిన కూలీలు తప్పనిసరిగా ఉండే విధంగా చర్యలు చేపడతామన్నారు.

పెద్దాపురం నుంచే ముడిసరుకు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని బాణసంచా తయారీదారులకు ముడి సరకు పెద్దాపురం నుంచి సరఫరా అవుతుందన్నారు. ఈ విషయాన్ని బాణసంచా తయారీదారుల విచారణ సందర్భంగా తెలిసిందన్నారు. కార్మికులకు బీమా, భద్రతా ప్రమాణాలు తదితర విషయాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. బాణసంచా నిల్వలు గృహ సముదాయాల్లో ఉండడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, అనధికారికంగా తయారు చేయడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. తాత్కాలిక దుకాణదారులకు దీపావళికి రెండు రోజులు ముందుగానే అనుమతులు జారీ చేస్తామన్నారు. అనధికార తయారీ కేంద్రాల వివరాలు ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్సై డి.సురేష్‌బాబు ఉన్నారు.

మందుగుండు సామగ్రి నిల్వ ఉంచితే చర్యలు



పామర్రులో తనిఖీలు చేస్తున్న ఎస్సై జానీ బాషా

కె.గంగవరం: ఇళ్ల వద్ద అక్రమంగా మందుగుండు సామగ్రి నిల్వ ఉంచితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కె.గంగవరం ఎస్సై జానీ బాషా హెచ్చరించారు. మండలంలో పలు గ్రామాల్లో ఆయన పర్యటించి లైసెన్సు పొందిన వ్యక్తులకు చెంది ఇళ్ల వద్ద తనిఖీలు నిర్వహించారు. ఎస్సై జానీ మాట్లాడుతూ తాత్కాలిక లైసెన్సు పొందిన వారి తమ వద్ద అక్రమంగా మందు గుండు సామగ్రి ఉంచకూడదన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో మందు గుండు సామగ్రి వల్ల ప్రమాదాలు జరిగాయని సూచించారు. దీనిపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. పామర్రు, యండగండి, కె.గంగవరంతో పాటు పలు గ్రామాల్లో తాత్కాలిక లైసెన్సు పొందిన వారి షాపులు, ఇళ్ల వద్ద తనిఖీ చేశామన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీ



అంగర ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు తోరాటి లక్ష్మణమూర్తి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గ్రామంలోని తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం నిర్వాహకుడు పెద్దింశెట్టి లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో పోటీలను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ భూ పోరాటంలో లక్ష్మణమూర్తి పాల్గొని వీరమరణం పొందారని, ఈనెల 13న ఆయన జయంతి నేపథ్యంలో 'సామాజిక సమస్యలు - విద్యార్థుల పాత్ర' అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించామన్నారు. విజేతలకు త్వరలో నగదు బహుమతులను అందజేస్తామని లక్ష్మణమూర్తి తెలిపారు.

తపాలా ఉద్యోగుల సంఘ నాయకుడి తొలగింపు తగదు

కపిలేశ్వరపురం (మండపేట): ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ మహదేవయ్యను విధుల నుంచి తొలగించడం తగదని పెన్షనర్ల ఉద్యోగ సంఘం నాయకుడు టపా పుల్లేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023లో ఉద్యోగుల సమస్యలపై పోరాడే క్రమంలో సమ్మె నోటీసు ఇచ్చారన్న నెపంతో మహదేవయ్యను సర్వీస్ నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఉద్యమాలను, ఉద్యమ నాయకులను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. మహదేవయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పుల్లేశ్వరరావు డిమాండ్ చేశారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు

కపిలేశ్వరపురం (మండపేట): చాంబర్ ఆఫ్ కామర్స్, ఎలక్ట్రానిక్స్ -హోమ్‌నీడ్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మండపేటలోని రోటరీ క్లబ్ హాల్‌లో శుక్రవారం జీఎస్టీ ధరల్లో నూతన మార్పులపై అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎస్టీ సంస్కరణలు నేపథ్యంలో ధరల్లో వచ్చిన మార్పులను ప్రయోగాత్మక అవగాహన కల్పించేందుకు గ్రాండ్ ఎగ్జిబిషన్ మేళా నిర్వహించారు. స్టాల్‌ను మండపేట కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ సింగం తిరుమలరావు, జీఎస్టీ అధికారులు బి.శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి సందర్శించారు. మేళాను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు తదితరులు పాల్గొన్నారు.